క్లుప్తంగా

నవనీత అలంకరణలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసంను పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదు లాంతర్ల సెంటర్‌లోని శ్రీ రుక్మిణి సత్య భామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి వెన్నతో (నవనీతం) అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఐఏఎల్-2024 కోర్టు డైరీ ఆవిష్కరణ



సత్తెనపల్లి: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) -2024 కోర్టు డైరీని సత్తెనపల్లి ఒకటో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎ.తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌసేలు సోమవారం వేర్వేరు చోట్ల ఆవిష్కరించి న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్, ఏపీపీ బగ్గీ నరసింహారావు, న్యాయవాదులు అంకాళ్ల వెంకటేశ్వర్లు, గంగూరి అజయ్ కుమార్, కోటగిరి లక్ష్మణ్, తాళ్ళూరి మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

అయోధ్య అక్షింతలు గ్రామాల్లో పంపిణీ



రాజుపాలెం: మండలకేంద్రంలో రాజుపాలెం కోదండరామాలయంలో అయోధ్య నుంచి వచ్చిన అయోధ్య శ్రీరామచంద్రమూర్తి స్పర్శ అక్షింతలను శ్రీరామనామ సంకీర్తనలు పాడుతూ అన్ని గ్రామాలకు సోమవారం పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అక్షింతలతో పాటు అయోధ్యరామ మందిరం నమూనా చిత్ర ప్రతిమలను కూడా అందించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అక్షింతల కలశానికి మొక్కుకున్నారు. వీహెచ్‌పీ సభ్యులు కేదారి రమేష్, చౌక్కా శ్రీనివాసరావు, కేదారి నాగేశ్వరరావు, అర్వపల్లి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: అయోధ్య శ్రీ రామ మందిరం నుంచి తీసుకువచ్చిన రామయ్య అక్షింతలు పట్టణంలోని సంఘం బజార్‌లో ఇంటింటికీ నారాయణ సేన నగర సంకీర్తన సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ సేన నగర్ సంకీర్తన సభ్యులు మాట్లాడుతూ పంపిణీ చేసిన అక్షింతలు ప్రతి ఇంట్లో అక్షంతల్లో కలుపుకొని ప్రతి శుభకార్యంలో వీటిని వాడే విధంగా చేసుకోవాలని సూచించారు. నారాయణ సేన నగర సంకీర్తన సభ్యులు అన్నం రమణ, కొల్లిపాకుల బాల సుబ్రమణ్యం, వాకా మహేశ్వరరెడ్డి, పులికొండ శ్రీనివాసరావు, కొత్త రామకృష్ణ, ఆనంద్, విశ్వేశ్వరరావు, చెక్క శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



నకరికల్లు: ట్రాక్టర్ కింద పడి గాయాలపాలైన వృద్ధుడు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కుంభా సాంబయ్య(67) ట్రాక్టర్‌పై డ్రైవర్‌కు కుడివైపున ఇంజన్‌పై కూర్చొని ప్రయాణిస్తున్నాడు. డ్రైవర్ అతివేగంగా ట్రాక్టర్‌ను నడపడంతో అదుపుతప్పి ట్రాక్టర్ కిందపడ్డాడు. ట్రాక్టర్ టైర్ల కిందపడడంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలిస్తుండగా పెద కాకాని వద్ద మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు కుంభా సాంబయ్య కుమారుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ సోమవారం తెలిపారు.

కోటి ఆశలతో నూతన ఏడాదికి స్వాగతం

- నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా సంబరాలు
- దేవాలయాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఎమ్మెల్యే కార్యాలయంలో వేడుకలు



పెదకూరపాడులో నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు స్వాగతం పలికారు. నూతన సంవత్సర వేడుకలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. అమరావతి అమర లింగేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆయన సతీమణి వసంతకుమారిలను ఆశీర్వదించారు. అనంతరం పార్టీ నాయకులు, అభిమానుల మధ్య నూతన సంవత్సరం కేక్‌ను కట్ చేశారు. అనంతరం 2024 వైఎస్సార్ సీపీ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గంలో అధికారులు, పోలీసు సిబ్బంది, పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు..

క్రోసూరు: నూతన సంవత్సరం 2024 సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు అర్ధరాత్రి నుంచి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దుకాణాలు, వ్యాపార సంస్థలన్నీ విద్యుత్‌దీపాలతో అలంకరించారు. నూతన సంవత్సరంగా బేకరీల్లో సందర్భంగా కేక్‌ల విక్రయాలు జోరుగా సాగాయి. సోమవారం ఉదయం ప్రజలందరూ తమ కుటుంబీకులు, బంధువులు, మిత్రులు ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని షిర్డీసాయిబాబ మందిరంలో ఐదు రకాల తీర్థప్రసాదాలతో నూతనసంవత్సర వేడుకలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని బాబాకు పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



పెదకూరపాడులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



క్రోసూరు షిర్డీ సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

- వైఎస్సార్ సీపీ క్రోసూరు కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతుల ఆధ్వర్యంలో నూతనసంవత్సర వేడుకలు నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు వరుసగా ఎమ్మెల్యేను కలుసుకుని దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలను అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరం ఎన్నికల సంవత్సరమని, మనమందరం మరోసారి శ్రమించి పార్టీని గెలిపించుకుందామని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేద్దామని, అదేవిధంగా తనను మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. అందరికీ నూతన శుభాకాంక్షలు తెలియచేశారు.

ఘనంగా పత్తి చెట్లలక్ష్మీ అమ్మవారి వార్షికోత్సవం

విప్పర్ల(క్రోసూరు): మండలంలోని విప్పర్ల గ్రామంలోని నిదానంపాటి పత్తిచెట్ల లక్ష్మీ అమ్మవారి 17వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వసంతకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సంతోషాలు నింపాలని ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



వార్షికోత్సవం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరరావు, వసంతకుమారి దంపతులు

15 షాదీఖానాలు.. రూ.5.15 కోట్లు



ధరణికోటలో నిర్మాణం పూర్తయిన షాదీఖానా



దొడ్లేరులో శ్లాబ్ పనులు పూర్తిచేసుకున్న షాదీఖానా

క్రోసూరు: ముస్లిం మైనార్టీలకు గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 15 షాదీఖానాలు (కమ్యూనిటీ భవనాలు) నిర్మించుకునేందుకు అనుమతులిచ్చారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో షాదీఖానాల నిర్మాణాలకు రూ.5.15కోట్లు నిధులు మంజూరయ్యాయి. ముస్లింల ఇళ్లల్లో పెళ్లిళ్లకు, శుభకార్యాలకు, ఇతర సమావేశాలకు, షాదీఖానాల అవసరాన్ని గుర్తించి మంజూరు చేశారు.

- అమరావతి మండలంలో నాలుగు షాదీఖానాలకు నిధులు కేటాయించటం జరిగింది. వాటిలో మునుగోడు రూ.35 లక్షలు, లేమల్లె రూ.40 లక్షలు, నెమలికల్లు రూ.40 లక్షలు, ధరణికోట రూ.40 లక్షలు డీఎంఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యాయి.
- బెల్లంకొండలో ఒక షాదీఖానాకు రూ.40 లక్షలు,
- క్రోసూరు మండలంలో క్రోసూరుటౌన్ రూ.35లక్షలు, దొడ్లేరు రూ.45 లక్షలు, ఊటుకూరు రూ.35 లక్షలు, పీసపాడు రూ.20లక్షలు, హసనాబాద్ రూ.20 లక్షలు, గుడిపాడు రూ.20 లక్షలు మంజూరయ్యాయి.
- అచ్చంపేట మండలంలో ఒక షాదీఖానాకు గాను రూ.40 లక్షలు మంజూరయ్యాయి.
- పెదకూరపాడు మండలంలో పెదకూరపాడు రూ.35 లక్షలు, లగడపాడు రూ.35 లక్షలు, పాటిబండ్లకు రూ.35 లక్షలు మంజూరు చేశారు.

మొత్తం 15 షాదీఖానాలు మంజూరు చేయటం జరిగింది. వాటిలో క్రోసూరు మండలంలోని పీసపాడు, హసనాబాద్, గుడిపాడు గ్రామాలు మినహా అన్ని షాదీఖానాల నిర్మాణాలు శ్లాబ్ దశకు చేరుకున్నాయి. కొన్ని పూర్తి చేసుకున్నాయి. రాబోయే రెండు మాసాల్లో పూర్తి హంగులతో షాదీఖానాలు ప్రారంభానికి సిద్ధమవుతాయని ఆయా గ్రామాల్లోని ముస్లిం పెద్దలు తెలిపారు.

ఏ ప్రభుత్వం ఈవిధంగా చేయలేదు..



ప్రతి మండలంలో ముస్లింల అవసరాల కోసం షాదీఖానాల నిర్మాణాలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేపట్టటం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనుమతులివ్వటం ఎంతో గొప్ప విషయం. గతంలో నాకు తెలిసి ఏ ప్రభుత్వం ఇంత గొప్పస్థాయిలో షాదీఖానాలు నిర్మించలేదు. ప్రభుత్వానికి ముస్లింల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

–సయ్యద్ అబ్దుల్ రహీం, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్, దొడ్లేరు

ముస్లింలకు షాదీఖానా ఎంతో అవసరం..



ప్రతి మండలంలో ముస్లింల కుటుంబాల్లో పెళ్లిళ్లకు, శుభ కార్యాలకు, ఇతర అవసరాలన్నింటికి ఇళ్లవద్ద స్థలాభావంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే షాదీఖానా ఉంటే అందరూ అక్కడికే చేరుకుని శుభకార్యాలు ఆనందంగా నిర్వహించుకోవచ్చు. షాదీఖానాల నిర్మాణానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేసిన కృషిని మాటల్లో చెప్పలేను

– జమాలుద్దీన్, ఇమాం, జామియా మసీదు క్రోసూరు

3 నుంచి పెంచిన పెన్షన్ల పంపిణీ

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్లను రూ.3 వేలకు పెంచారని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పెన్షన్ల పంపిణీపై సోమవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ముందుగా నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీవరకు వారం రోజుల పాటు పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 3వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఏటా పెన్షన్లు పెంచుకుంటూ వచ్చారన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు ఆపకుండా ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ఈ నెలలోనే వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత నిధులు కూడా లబ్ధిదారులకు అందబోతున్నాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజల సంతోషాన్ని పంచుకుంటామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, వెలది అప్పారావు, గార్లపాటిదాసు, మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఈవీఎంలపై అవగాహన

ముప్పాళ్ల: మండలంలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఈ నెల 2వ తేదీన ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ సోమవారం తెలిపారు. ఓటర్లు ఈవీఎంల పనితీరుపై అవగాహన, సందేహాలను తొలగించుకోవచ్చని, ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నాదెండ్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు వివరాల మేరకు.. గణపవరం గ్రామానికి చెందిన టీవీ మెకానిక్ బీరంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం రాత్రి రాజీవ్‌గాంధీ కాలనీ వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. మేడికొండూరు మండలం దుర్గాపాలేనికి చెందిన షేక్ బషీర్ మిత్రుడితో కలిసి తన ద్విచక్రవాహనంపై వెళ్తూ.. శ్రీనివాసరావును ఢీకొన్నారు. ఈ ఘటనలో శ్రీనివాసరావు కాలికి తీవ్రగాయం కాగా, 108 అంబులెన్స్‌లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

కళాకారులను ప్రోత్సహించాలి

చిలకలూరిపేటటౌన్: కళాకారులను ప్రోత్సహించటం సామాజిక బాధ్యత అని తహసీల్దారు, రెడ్ క్రాస్ చిలకలూరిపేట శాఖ అధ్యక్షురాలు జి.సుజాత అన్నారు. సోమవారం పట్టణంలోని జంపని భాస్కరరావు సినీ కల్యాణ మండపంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న తహసీల్దారు మాట్లాడుతూ సమాజంలోని సామాజిక సమస్యలే ఇతి వృత్తాలుగా కళాకారులు ప్రదర్శనలు కొనసాగించాలని సూచించారు. సీనియర్ రెడ్ క్రాస్ సభ్యులకు సత్కరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకుడు జంపని భాస్కరరావు, ఏవీ శివయ్య పాల్గొన్నారు.



6,892 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా

శావల్యాపురం: వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా.. స్వయం సహాయక మహిళా గ్రూపుల సభ్యులకు నాలుగో విడత రుణ మాఫీ నగదు ప్రభుత్వం ఈ నెలలో జమ చేయనున్నట్లు ఏపీఎం జి.వాసుబాబు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 24 గ్రామ సమాఖ్యా సంఘాలు ఉండగా 706 మహిళా గ్రూపుల్లో 6,892 సభ్యులకు సంబదించి బయోమెట్రిక్ పనులు పూర్తి చేశామన్నారు. సచివాలయాల వారిగా అర్హత సాధించిన మహిళాల జాబితాను ఈ నెల 4 వరకు ప్రదర్శిస్తామన్నారు. అభ్యంతరాలుంటే.. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో తప్పులు జరిగితే సవరణలు చేస్తున్నట్లు తెలిపారు. సీసీలు ఖాజావలీ, గొట్టం రమాదేవి, బేబిరాణి ఉన్నారు.

వృక్షాంజనేయస్వామికి విశేష పూజలు



నకరికల్లులోని వృక్షాంజనేయస్వామి

నకరికల్లు: స్థానిక ఎన్నెస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వృక్షాంజనేయస్వామి వారికి సోమవారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు తుంగతుర్తి పాండు రంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వయంభువుగా వెలసిన స్వామివారికి కుంకుమ, పసుపు, గంధం, పాలు, పెరుగు, నెయ్యి తదితర విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా భక్తసంఘం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలుప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

మంత్రి అంబటికి ఆర్డీఓ శుభాకాంక్షలు



మంత్రి అంబటి రాంబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి

సత్తెనపల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా మంత్రి అంబటి రాంబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులకు శుభాకాంక్షలు..

సత్తెనపల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, సాంబశివరావు దంపతులకు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పట్టణంలోని చైర్‌పర్సన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా చైర్‌పర్సన్ దంపతులను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఏరియా వైద్యశాలలో మినీ ఆర్వో ప్లాంట్



డాక్టర్ సుజాతతో రిబ్బన్ కట్ చేసి ఆర్వో ప్లాంట్ ప్రారంభింపజేస్తున్న కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకే మినీ ఆర్వో ప్లాంటును ప్రారంభించడం జరిగిందని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. కొత్త రామకృష్ణ తన మిత్రుల సహకారంతో పట్టణంలోని ఏరియా వైద్యశాలలో సోమవారం మినీ ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏరియా వైద్యశాలలో ఎప్పటి నుంచో తాగునీటి సమస్య ఉందని, దానిని గుర్తించి శాశ్వతంగా మంచినీటి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాల్సిందిగా సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు కోరారన్నారు. దీనిపై వెంటనే స్పందించి రూ. 75 వేలతో ఆర్వో సిస్టం కొనుగోలు చేసి వైద్యశాలకు అందించామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఎంతో సేవా భావంతో పనిచేస్తున్నారన్నారు. మినరల్ వాటర్ ఆర్వో సిస్టం రోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తొలుత వైద్యశాల వైద్యులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. వైద్యశాల అభివృద్ధిలో దాతలను భాగస్వాములను చేస్తున్న అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, సెక్యూరిటీ, శానిటరీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దల సమక్షంలో ప్రేమవివాహం



గ్రామపెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్న జంట

అచ్చంపేట: ఏడాదిగా కొనసాగుతున్న ప్రేమికుల ప్రేమాయణం ఎట్టకేలకు సఫలీకృతమైంది. గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం రాత్రి ఇద్దరూ ఒక్కటయ్యారు. మండలంలోని కొండూరు గ్రామం, బీసీ కులానికి చెందిన చొప్పరపు శ్రీనివాసరావు, అదే గ్రామం ఎస్సీ కులానికి చెందిన సుంకిశాల దీపిక గత ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలిసి కట్టడి చేశారు. అయినా వారి ప్రేమాయణం ఎంతమాత్రం తగ్గలేదు. ఒకరిపై ఒకరు మరింత ఇష్టం పెంచుకున్నారు. పెద్దలను ఒప్పించిన తరువాతే వివాహం చేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఇరువురు ఏడాదిగా వారి వారి పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేశారు. గ్రామ పెద్దలు కల్పించుకుని శ్రీనివాసరావు తండ్రి స్వామి, దీపిక తండ్రి ఏసురత్నంలతో సంప్రదించి ఒప్పించారు. ఆదివారం రాత్రి ఇరువురి బంధువుల సమక్షంలో గ్రామంలోని చర్చిలో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం జరిపించారు. ప్రేమికులు ఇరువురు మేజర్లు కావడంతో ఎలాంటి అభ్యంతరాలు లేకుండా వివాహం సజావుగా జరిగింది. కార్యక్రమంలో వరుని తరుపు గణపవరపు రామమూర్తి, బలరాజు సైదరాజు, చొప్పరపు శ్రీను, యేళ్ల ఆంజనేయులు, వధువు తరుపు ఆనంద్‌కుమార్, నవనీతరావు తదితరులు హాజరయ్యారు. మరికొంతమంది గ్రామ పెద్దల సమక్షంలో ఇరువురు దండలు మార్చుకుని ఒక్కటయ్యారు.

మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్ ప్రారంభం రేపు



ఇక్కుర్రు గ్రామంలో మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్

రొంపిచర్ల: నరసరావుపేట నియోజకవర్గంలోని 9 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా నాబార్డు నిధులతో నిర్మిస్తున్న ఆరు మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్‌ల నిర్మాణం పూర్తి అయ్యింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 20 మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్‌ల నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేయించారు. అందులో 90 శాతం నాబార్డు నిధులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు 10 శాతం నిధులు సమకూర్చుకోవాల్సి ఉంది. ఒక్కొక్క సంఘంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి నాబార్డు రూ.40 లక్షలు అందజేస్తుండగా, సంఘం రూ.4 లక్షలు సమకూర్చుకుంటోంది. ఇక్కుర్రు పీఏసీఎస్‌లోని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకార భవన్ షాపింగ్ కాంప్లెక్స్ గోదాం, మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఈ నెల 3న మధ్యాహ్నం ప్రారంభించనున్నట్లు సంఘం చైర్‌పర్సన్ కన్నెబోయిన శ్రీనివాసరావు, సీఈవో కంటు శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, విడదల రజిని, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీక్రిస్టినా, ఏపీ ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి మల్లెల ఝాన్సీరాణి, జీడీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మీ, కలెక్టర్ లోతేటి శివశంకర్, డీసీవో ఉదయగిరి నాగశ్రీనివాసరావు హాజరు కానున్నట్లు చెప్పారు.

పలుకూరులో పోలీస్ పికెట్



బందోబస్తులో పోలీసులు

బొల్లాపల్లి: మండలంలోని పలుకూరు గ్రామంలో బండ్లమోటు పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై డి.చెన్నకేశవులు సోమవారం తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, ఎటువంటి ఘర్షణలకు దారితీయకుండా పోలీసులు పహారా కొనసాగుతుందని చెప్పారు. ఇరువర్గాలకు చెందిన సుమారు 8 మందికి గాయాలయ్యాయని తెలిపారు. వైఎస్సార్ సీపీకి చెందిన బంకా ఏల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, వీరు రాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడ్డామని, టీడీపీకి చెందిన 27 మంది ఈ దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. టీడీపీకి చెందిన సంపతి మల్లేశ్వరరావు వైఎస్సార్ సీపీకి చెందిన 14 మంది దాడిలో పాల్గొన్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇరువర్గాలు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామంలో శనివారం అర్ధరాత్రి వి.బ్రహ్మయ్య ఓ ఇంటి ముందు మూత్ర విసర్జన చేశాడనే ఆరోపణలతో వివాదం నెలకొంది. ఆదివారం వివాదం ఘర్షణకు దారితీసిందని ఎస్ఐ తెలిపారు.